క్లుప్తంగా

ఘంటసాల గానం అజరామరం



ఘంటసాల చిత్రపటానికి నివాళులు

నెల్లూరు(బృందావనం): ఘంటసాల గానం అజరామరమని సీనియర్ గాయకుడు, అభినవ ఘంటసాల బిరుదాంకితుడు పాటూరి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని నర్తకి సెంటర్‌లో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఘంటసాలను జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎ.జయప్రకాష్, ఆనంద్, జనార్దన్, నాగరాజు, మారి, అంకిరెడ్డి రఘురామిరెడ్డి, ప్రసాద్‌బాబు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని దేవరపాళెం, కొండ్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్‌వీ నాగమోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుకునేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. దేశంలోని అన్నదాతలకు 11 అంకెల యూనిక్ ఐడీని ఇవ్వబోతుందన్నారు. దాని ద్వారా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తదితర పథకాలు పొందేందుకు అర్హులుగా ఉంటారన్నారు. రిజిస్ట్రేషన్ కోసం రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జెరాక్స్‌లతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఆధార్‌కు లింకైన ఫోన్‌ను కూడా తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ ఉద్యాన సహాయకులు విష్ణు పాల్గొన్నారు.

నిద్రలేమితో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ దీక్షాంతి నారాయణ్

నెల్లూరు(అర్బన్): మారిన జీవనశైలి కారణంగా ఆలస్యంగా నిద్రపోవడం, మొబైల్, టీవీలను పొద్దు పోయేంతవరకు చూస్తూ నిద్ర పట్ల అలక్ష్యం చేస్తున్న కారణంగా రోజురోజుకూ న్యూరలాజికల్ (నరాలు) సమస్యలు అధికమయ్యాయని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ దీక్షాంతి నారాయణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎపిలెప్సీ డేను పురస్కరించుకుని మంగళవారం ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాత్రి వరకు పని గంటలు పొడిగించడం, ఒత్తిడి, కంప్యూటర్ స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం లాంటి కారణాలతో ఆలస్యంగా నిద్రపోతే బ్రెయిన్ స్ట్రోక్ లాంటి సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఉందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు త్వరగా నిద్రపోవాలన్నారు. స్క్రీన్ టైమింగ్‌ను పూర్తిగా తగ్గించాలన్నారు. చిన్న, చిన్న మార్పులతో మెదడు, నాడీకణాల ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు. ఇంకా న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ వైష్ణవి పాల్గొని మాట్లాడారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు రూరల్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నగరంలోని పదో డివిజన్‌లో బీజేపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్, సీనియర్ నాయకులు సాయి శ్రీనివాస్, తన్నీరు వెంకట సుబ్బారావు, హరికృష్ణ, నరేష్, గాదంశెట్టి సురేష్, పొట్టి శివ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ తెలుగుగంగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నేతాజీ నగర్ విద్యుత్ ఫీడర్‌లో రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్న నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శివాజీనగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎస్వీటీ కాలనీ, డైకస్‌రోడ్డు, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భయపడొద్దు.. ఇబ్బందులుంటే చెప్పండి

• విద్యార్థినులకు డీఎస్పీ సూచన



విద్యార్థినులతో డీఎస్పీ పి.సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): విద్యార్థినులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని నగర డీఎస్పీ పి.సింధుప్రియ సూచించారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్ జోసఫ్ బాలికల వసతిగృహంలో మంగళవారం మహిళలు, చిన్నారుల రక్షణ చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు గురైతే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కావన్నారు. వారి మాయ మాటలు, ప్రలోభాలకు గురికాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇంటా, బయట ఎలాంటి సమస్యలున్నా తల్లిదండ్రుల ద్వారా లేదా నేరుగా పోలీసులకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని, వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో 112, 1098 ఫోన్ నంబర్లకు కాల్ చేస్తే తక్షణమే సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు, వసతిగృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ లేఅవుట్లు

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): తక్కువ ఖర్చుతో సొంతింటి కల నెరవేర్చేందుకు మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ లేఅవుట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు మంగళవారం కలెక్టరేట్‌లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి నారాయణ సూచన మేరకు హైవేకు దగ్గరగా, నివాసాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. 8 నియోజకవర్గాల్లో నుడా విస్తరించి ఉందని ఆయా ప్రాంతాల్లో లేఅవుట్లను సిద్ధం చేయనున్నామన్నారు. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నుడా పరిధిలో అనేక అక్రమ లేఅవుట్‌లున్నాయని వాటిని త్వరలోనే తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ, జేసీ కార్తీక్, ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తించాలి



డైకస్ రోడ్డులో స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి వాణి

నెల్లూరు(అర్బన్): 'సకాలంలో నడవలేని, మాట్లాడలేని, వినికిడి లోపం, గ్రహణమొర్రి, గ్రహణ శూల లాంటి లక్షణాలున్న పిల్లలు, మానసిక వైకల్యం ఉన్న పిల్లలను ప్రాథమిక దశలోనే గుర్తించాలి. వారిని బాల భవిత కేంద్రాలకు తరలించి వైద్య సేవలందించడం ద్వారా సాధారణ స్థితికి చేరుతారు' అని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు డైకస్ రోడ్డులోని పసిబిడ్డలున్న పలు ఇళ్లను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడుతూ పిల్లలకు లోపాలున్నట్లు గుర్తిస్తే పెద్దాస్పత్రి ఆవరణలోని బాల భవిత కేంద్రం (ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్)కు తీసుకెళ్లాలన్నారు. అక్కడ ఉచితంగా పరీక్షలు చేసి వైద్యచికిత్స అందిస్తారన్నారు. ఇంటింటికీ తిరుగుతూ లోపాలున్న పిల్లలను ఈనెల 24వ తేదీ వరకు గుర్తిస్తామన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకుడు ఐ.శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ సతీష్ బాబు, పారా లీగల్ వలంటీర్ శ్రీనివాసులు, సురేంద్ర, అంగన్‌వాడీ వర్కర్లు సుధా, ప్రసన్న పాల్గొన్నారు.

మా పిల్లల్ని ఇబ్బంది పెట్టొద్దు



ఉర్దూ పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

నెల్లూరు సిటీ: 'మా పిల్లల్ని దూరంగా ఉన్న మరో పాఠశాలకు పంపలేం. అధికారులు విలీన ప్రక్రియను విరమించుకోవాలి' అని పలువురు తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. రూరల్ మండలం వావిలేటిపాడు గ్రామంలో ఉన్న ఉర్దూ పాఠశాలలో 3, 4, 5 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 30 కన్నా తక్కువ ఉందని ప్రభుత్వం సమీపంలోని మరో స్కూల్లో విలీనం చేసేందుకు ప్రక్రియ ప్రారంభించినట్లు తల్లిదండ్రులు తెలుసుకున్నారు. దీంతో మంగళవారం బడి ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ పిల్లల్ని ఇబ్బంది పెట్టొద్దన్నారు. విలీన ప్రక్రియను అధికారులు వెంటనే విరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా 'కృష్ణచైతన్య' వార్షికోత్సవం



చంద్రశేఖరరెడ్డి తదితరులకు సన్మానం

నెల్లూరు(టౌన్): కృష్ణచైతన్య జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం స్థానిక మినీబైపాస్ రోడ్డులోని అనిల్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ 26 ఏళ్ల క్రితం కృష్ణచైతన్య విద్యా సంస్థలను ఏర్పాటు చేశామన్నారు. 140 మంది విద్యార్థులతో ప్రారంభం కాగా నేడు 17 వేలమందికి పైగా విద్యనభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం చంద్రశేఖరరెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ ఆర్వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీన్లు రామాంజనేయులురెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, రమేష్, ఏఓ హరి, చిరంజీవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం వృద్ధ దంపతులపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆస్తి పంచలేదన్న కోపంతో వృద్ధ దంపతులపై కోడలు, మనవరాలు దాడిచేసి గాయపరిచిన ఘటన జనార్దనరెడ్డికాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన బలరామయ్య, ఆదిలక్ష్మమ్మలు దంపతులు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. చిన్నకుమారుడు రాఘవరెడ్డి నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి చిన్నకోడలు కృష్ణవేణి ఆస్తి కోసం బలరామయ్య, ఆదిలక్ష్మమ్మను ఇబ్బందులకు గురిచేయసాగింది. ఈనెల 8వ తేదీన కృష్ణవేణి తన కుమార్తెతో కలిసి బలరామయ్యపై దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన ఆదిలక్ష్మమ్మపై సైతం దాడి చేశారు. ఈమేరకు ఆదిలక్ష్మమ్మ మంగళవారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించాలి



ఆర్ఐఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాల్‌టికెట్లను ఫీజులతో ముడిపెట్టకుండా విద్యార్థులకు ఇవ్వాలన్నారు.

ప్రాక్టికల్స్ ప్రారంభమైనా నేటికీ కొన్ని కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విక్రమ్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

'రంగడి'కి బంగారు గరుడసేవ ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): మాఘ శుద్ధ పౌర్ణమి (వ్యాస పూర్ణిమ)ను పురస్కరించుకుని బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి తిరుమంజనం, సాయంత్రం 6.30 గంటలకు బంగారు గరుడసేవ ఉత్సవం నిర్వహిస్తామని ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి అళ్ల శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలని కోరారు.

• బాలాజీనగర్‌లో బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారు గరుడ వాహన విహారం చేయనున్నారని వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సీతారామ స్వామి మందిరం నుంచి జరుగనుందన్నారు. ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆర్చరీ పోటీల్లో రత్నం విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నెల్లూరు(టౌన్): ఏపీ జెన్‌కో నేలటూరులో నిర్వహించిన ఆలిండియా యూత్ ఇండోర్ ఫీల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో డా.కిషోర్స్ రత్నం విద్యార్థులు వివిధ కేటగిరీల్లో మెడల్స్ సాధించినట్లు రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు మంగళవారం తెలిపారు. హైస్కూల్స్ విద్యార్థులు టోఫీ, వెన్నెల, హంసిని, ఆదిత్యకృష్ణ గోల్డ్ మెడల్, సురార్పితసాయి, హరిణి సిల్వర్ మెడల్, శ్రీమంత్ బ్రాంజ్ మెడల్‌ను సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల, ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై దృష్టి

నెల్లూరు(పొగతోట): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ఏసీలు, ఏపీఎంలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని తెలిపారు.

ఆధార్ అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న మోహన్‌రావు

నెల్లూరు(పొగతోట): ఆధార్ అనుసంధానం, అప్‌డేట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్తి సమాచారంతో ఆధార్ అప్‌లోడ్ చేయాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణపత్రాల విషయంలో నూతన నిబంధనలు పాటించాలన్నారు. అవకతవకలు లేకుండా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని ఆమంచర్ల పంచాయతీలో అప్పయ్యకండ్రిగ గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. కందుకూరు రమణమ్మ, ఉప సర్పంచ్ మలినేని వేణునాయుడు తదితరులు పాల్గొన్నారు.

• పొదలకూరు రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతోందని ఆర్‌అండ్‌బీ అధికారులపై శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. 24 గంటల్లో రోడ్డు పనులు ప్రారంభం కావాలని తెలిపారు.

పన్ను బకాయిలు చెల్లించకపోతే చర్యలు

• కమిషనర్ సూర్యతేజ
• పలువురు అధికారులకు షోకాజ్ నోటీసుల జారీ



సమావేశానికి విచ్చేసిన ఆర్వో, ఆర్ఐలు, కార్యదర్శులు

నెల్లూరు(బారకాసు): 'పన్ను బకాయిలున్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేయాలి. నిర్దేశించిన సమయంలోపు నగదు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు చేయాలి' అని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగాధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీ లోపు పన్ను వసూళ్ల లక్ష్యాలను సాధించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్టప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో సమస్యలు పరిష్కారమయ్యేలా యత్నించాలని, అవసరమైతే ఎడల ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే సచివాలయ పరిధిలోని నూతన భవనాలు, అదనపు నిర్మాణాలు చేపట్టి పూర్తయిన వాటిని గుర్తించి ఆస్తి పన్ను పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు రామ్మూర్తి నగర్, ఆదిత్యనగర్, బర్మాషల్‌గుంట వార్డు సచివాలయాల ఇన్‌చార్జి పరిపాలన కార్యదర్శులు పి.రమ్య, ఎం.సాయిపూజ, జె.జయలక్ష్మిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు.

మందుల కొరత లేకుండా చూడాలి

• డీఎంహెచ్ఓ సుజాత



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా చూడాలని డీఎంహెచ్ఓ సుజాత ఆదేశించారు. మంగళవారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఫార్మసిస్టులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కువగా ఉపయోగించే మందులను దృష్టిలో ఉంచుకుని స్టాక్‌ను పరిశీలించుకుంటూ సకాలంలో ఇండెంట్ పెట్టి తెచ్చుకోవాలన్నారు. మందులను నిల్వ ఉంచే గదులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వినియోగించే మందుల వివరాలను ఈ – ఔషధిలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వేసవి కాలం నేపథ్యంలో వ్యాక్సిన్‌లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు అందించడంలో ఫార్మసిస్టులు తగిన స్టాక్ నిల్వ ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా ఎపిడిమిక్ అధికారి డాక్టర్ భాస్కర్, ఎస్ఓ సహనా, ఫార్మసీ అధికారి రాధా తదితరులు పాల్గొన్నారు.

పూల కుండీలను ఏర్పాటు చేయండి

• కమిషనర్ సూర్యతేజ



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

నెల్లూరు(బారకాసు): 'నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న ఫ్లోర్ పాయింట్లను గుర్తించాలి. వాటిని శుభ్రపరిచి పూల కుండీలను ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలి' అని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. మంగళవారం ఆయన 43వ డివిజన్ కోటమిట్ట, జెండా వీధి, కుమ్మరి వీధి, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో పూడికతీత అనంతరం రోడ్లపై సిల్టును ఉంచరాదని, ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. ప్రధాన ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా పూల కుండీలను ఫెన్సింగ్‌తోపాటు ఏర్పాటు చేసినందుకు స్థానిక శానిటేషన్ సెక్రటరీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ అభినందించారు. ప్రతి సచివాలయ సెక్రటరీకి వంద కుండీలను అందజేసి వారి డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సూచించారు. చేపల మార్కెట్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ఐలాండ్‌లో గతంలో సూచించిన విధంగా పచ్చదనాన్ని మెరుగుపరిచి అందంగా తీర్చిదిద్దారని, ఇదేవిధంగా మరికొన్ని ప్రాంతాలను గుర్తించి ఐలాండ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం ఫిష్ మార్కెట్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో లెప్రసీపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(టౌన్): స్థానిక సంతపేటలోని ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్పర్శ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన డీఎల్ఏటీఓ డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స చేసినట్లయితే అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉంటే వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉచితంగా అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, డీపీఎంఓలు సుబ్బయ్య, రమణారెడ్డి, సీఓ తిరుపతయ్య, ఏఎన్ఎంలు హసీనా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కళాశాల పూర్వ విద్యార్థులు

నెల్లూరు(బృందావనం): కావలిలోని జవహర్‌భారతి కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం మంగళవారం నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో జరిగింది. 1960, 1970 దశకాల నాటి విద్యార్థులు 60 మంది హాజరయ్యారు. వారందరూ ఆనాటి విషయాలను మననం చేసుకుని మురిసిపోయారు. తామందరం జీవితంలో చక్కగా స్థిరపడేందుకు కారణం జవహర్ భారతి కళాశాలేనంటూ అభిమానాన్ని చాటుకున్నారు. ఆత్మీయ పలకరింపుల నడుమ పూర్వ విద్యార్థుల కలయిక ఆహ్లాదకరంగా సాగింది. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాడు దొడ్ల రామచంద్రారెడ్డి గొప్ప దార్శనికతతో కళాశాలను స్థాపించి ఎందరికో ఉన్నత విద్యను అందించారన్నారు. సమావేశాన్ని చెలంచర్ల భాస్కరరెడ్డి, పెనుబల్లి హనుమంతరావునాయుడు, వేమారెడ్డి నిరంజన్‌రెడ్డిని అభినందించారు.

అనుమానంతో వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో ఓ వ్యక్తిపై భార్య, కుమార్తె, వారి బంధువులు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. సత్యనారాయణపురానికి చెందిన నాగేశ్వరరావు, కృష్ణకుమారి దంపతులకు ముగ్గురు సంతానం. నాగేశ్వరరావు వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో భార్య తరచూ గొడవ పడుతోంది. అలాంటిదేమీ లేదని చెప్పినా ఆమె వినలేదు. సోమవారం రాత్రి నాగేశ్వరరావు నిద్రిస్తుండగా అతని భార్య, పెద్ద కుమార్తె, మరో ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. అతడి కళ్లలో కారం కొట్టి దాడిచేశారు. గాయాలపాలైన ఆయన ఈమేరకు మంగళవారం రాత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నెల్లూరు(టౌన్): సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ విజన్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావులు తెలిపారు. మంగళవారం స్థానిక హరనాథపురంలోని జెనెక్స్ విజన్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఏ ఫైనల్‌లో కె.జాన్ 12, అఖిల్ ఆయాన్ 38వ ర్యాంకు, సీఎంఏ ఇంటర్‌లో కె.అజేయ్ 14, నవ్యశ్రీ 20, వెంకటహేమంత్ 21, ప్రవీణ్‌కుమార్ 23, కె.నవీన్ 25, అమూల్య 37, పునీత్ 43వ ర్యాంకు సాధించారన్నారు. ఇంటర్‌లో 134 మంది, ఫైనల్లో 31 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

16న తిరుపతిలో వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(బృందావనం): ఈనెల 16వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడలోని వైఖానస కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారికి వివాహ పరిచయ వేదిక, రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగనుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి అమానుషమని, అందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.